క్లుప్తంగా

అంకిత భావంతో పని చేయాలి



తహసీల్దార్‌తో రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గ సభ్యులు

నరసాపురం రూరల్: విధి నిర్వహణలో సిబ్బంది, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని నరసాపురం తహసీల్దార్ అయితం సత్యనారాయణ అన్నారు. బుధవారం నరసాపురం మండలం గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా రాపాక ప్రసాదరావు, కార్యదర్శి పొన్నపల్లి వంశీ, ఉపాధ్యక్షులు ఎల్లా రామకష్ణ, కోశాధికారి నీలం సుబ్బలక్ష్మీ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని తహసీల్దార్ అయితం సత్యనారాయణ, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

పింఛన్ల నిలిపివేత తగదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగ పింఛన్‌దారులు

నరసాపురం రూరల్: అనర్హుల వంకతో దివ్యాంగుల పింఛన్లను తొలగించడం సమంజసం కాదని వెంటనే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించి దివ్యాంగులను ఆదుకోవాలన ద్ధెంసీ మాజీ వైస్ చైర్మన్, కూటమి నాయకుడు యర్రంశెట్టి బాబులు అన్నారు. బుధవారం నరసాపురం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను నోటీసులు అందుకున్న దివ్యాంగ పింఛన్‌దారులతో కలిసి వినతిపత్రం అందించారు. ఎంపీడీఓను కలిసిన వారిలో తెలగంశెట్టి వాసు, అధిక సంఖ్యలో దివ్యాంగులు ఉన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



పెద్దింట్లమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న అధికారులు

పెనుగొండ: పెనుగొండ శివారు మల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయం రూ.3,71,889 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధకారి డి.పుష్పభాను తెలిపారు. దేవస్థానం తణుకు డివిజన్ పర్యవేక్షణాధికారి జి ప్రసాద్, గ్రూపు ఆలయ ఈవో ఎంవీవీ సత్యనారాయణల పర్యవేక్షణలో ఐదు నెలల 10 రోజులకు గానూ బుధవారం హుండీ లెక్కించినట్లు వివరించారు. లెక్కింపులో గుర్రాల శ్రీనివాస రావు, గుర్రాల సూరిబాబు, దుప్పనపూడి నాగేశ్వరరావు, కూనపరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఎన్ఆర్ఈజీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

పెనుగొండ: ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ ఆదేశించారు. బుధవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. మండలంలో అక్షర ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి 10 మంది అభ్యాసకులకు ఒక వలంటీరును గుర్తించాలన్నారు. కంపోస్టు పిట్‌ల నిర్మాణానికి అర్హులను గుర్తించాలన్నారు. రైతుల వ్యవసాయ పనులకు కూలీల కొరత లేని విధంగా క్షేత్ర సహాయకులు వ్యవసాయ శాఖ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీఓ రాజేష్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



పెనుగొండలో మానవత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెనుగొండ మానవత శాఖ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం మానవత సభ్యులు, ఆక్స్‌ఫర్డ్ స్కూలు విద్యార్థులు, అధ్యాపకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ, జిల్లా సభ్యుడు కర్రి నరేంద్ర రెడ్డి, దొరబాబు, షేక్ మస్తాన్, బచ్చు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు తూట్లు.. ప్రజల పాట్లు



పెనుగొండ మునమర్రు రహదారి ఇలా..



కొఠాలపర్రులో గోతులమయంగా ఉన్న రహదారి



పెనుగొండ శివారున రహదారి దుస్థితి

- వర్షాలతో అధ్వానంగా తయారైన రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

పెనుగొండ: అసలే అంతంత మాత్రంగా ఉన్న గ్రామీణ రహదారులు భారీ వర్షాలతో తూట్లు పడ్డాయి. రెండు రోజులు పాటు కురుస్తున్న వర్షాలతో గోతులు మరింత భారీ గోతులుపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ఆచంట, పెనుగొండ మండలాల్లో మండల కేంద్రాలను కలిపే గ్రామీణ ప్రాంతాల రహదారులు ఇబ్బందికరంగా మారాయి. పెనుగొండ మునమర్రు రహదారి గోతులతో నిండిపోయింది. దీనికి తోడు ఇటీవల మట్టి ట్రాక్టర్ల రాకపోకలతో గోతులమయంగా మారింది. మట్టి సైతం రోడ్డుపై పడిపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలతో బురదగా మారి వాహనదారులు జారిపడిపోతున్నారు. మట్టి ట్రాక్టర్ల రాకపోకలతో పడ్డ గోతులు మరింత పెద్దగా మారిపోయాయి. దీంతో రహదారి పొడవునా గోతులు పడ్డాయి.

కొత్తగా వస్తే ప్రమాదమే

మండలంలోని కొఠాలపర్రు రహదారి సైతం గోతులుగా మారింది. ప్రసిద్ధిగాంచిన కేశవస్వామి ఆలయం చుట్టూ రహదారి పూర్తిగా గోతులు పడ్డాయి. దీంతో గోతులు వర్షంతో నిండిపోవడంతో అంచనా తెలియక పడిపోతూ గాయాలు పాలవుతున్నారు. పెనుగొండ శివారు ప్రాంతంలోనూ రహదారి గోతులతో నిండిపోయింది. నడిపూడి మిద్దేవారి పాలెం రహదారి తూట్లు పడ్డాయి. ఆచంట మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆచంట ఆచంట వేమవరం రహదారి మరీ దారుణంగా మారింది. గోతులుగా మారడంతో రాకపోకలకు నానావస్థలకుగురవుతున్నారు. ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మరింతగా గోతులు పడ్డాయన్నారు. దీంతో ప్రయాణం చేయడానికి హడలిపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. వరుస ముసుర్లుతో కురిసిన భారీ వర్షాలతో రెండు మండలాల్లోనూ గ్రామీణ రహదారులన్నీ గోతులమయంగా మారాయన్నారు. గోతుల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి కనీసం గోతులు పూడ్చి ప్రజలను ఆదుకోవాలంటూ ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు



రైల్వేగేట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం: పట్టణంలోని చినమామిడిపల్లి రైల్వే గేట్ వద్ద పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రయాణించడానికి వీలుగా నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభిచడానికి సన్నాహాలు చేస్తున్నామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. బుధవారం బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. గేట్ సమస్య పరిష్కారానికి మూడేళ్లక్రితం బైపాస్ రోడ్డు నిర్మించడంతో గేట్‌కు అవతల, ఇవతల ప్రాంతాల వారు రాకపోకల విషయంలో దూరం పెరిగి ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీఓ చెప్పారు. ఇరు ప్రాంతాల వారికి వెలుసుబాటుగా ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ అంగీకరించిందన్నారు. ఆయన వెంట రైల్వే అదికారులు మయాన్ ఉపాధ్యాయ, పీఎంకే శాస్త్రి, మధుబాబు, ఇరిగేషన్ డీఈఈ బి.మోహనకృష్ణ, ఆర్అండ్‌బీ ఏఈ కె.ప్రసన్నబాబు, నరసాపురం తహసీల్దార్ అయితం సత్యనారాయణ ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికి గుర్తింపు



వేములదీవిలో నూతన గ్రామ కమిటీతో వైఎస్సార్ సీపీ నాయకులు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, గౌరవం ఎప్పుడూ ఉంటాయని పార్టీ పాలక మండలి సభ్యుడు పీడీ రాజు అన్నారు. బుధవారం నరసాపురం మండలం వేములదీవి తూర్పు గ్రామంలో పార్టీ నూతన గ్రామకమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొల్లు రాంబాబు, ఉపాధ్యక్షులుగా తిరుమాని ధర్మరాజు, దాసరి సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శులుగా ఘంటశాల రత్తయ్య, తిరుమాని వెంకటేశ్వర్లు, సంగాని మాణ్రాజు, కార్యదర్శులుగా నేతల, కొయ్యలగడ్డ వెంకట్రాజు, తిరుమాని వీర్ల వెంకయ్య, కార్యవర్గ సభ్యులుగా కొయ్యలగెడ్డ పెంటయ్య, వెంకయ్య, సంగాని నరశింహస్వామి, తిరుమాని రామారావు, కొల్లాటి మాణ్రాజు, పోతాబత్తుల వెంకటేశ్వర్లు, తిరుమాని జలచంద్రుడు, మోకా రాంబాబు, అంద్రాజు శ్రీను ఎన్నికయ్యారు. యూత్ గ్రామ అధ్యక్షులుగా జెల్లి నరసింహస్వామి, మేధావులఫోరం అధ్యక్షుడు కొల్లాటి శ్రీనివాసరావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికై న వారిని నరసాపురం నియోజకవర్గ సమన్వయ కర్త, జిల్లాపార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు. జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, సర్పంచ్ తిరుమాని శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు సంగాని రాంబాబు, తిరుమాని రామకృష్ణంరాజు, కడలి రాంబాబు, దొండపాటి వెంకట్, పులపర్తి ప్రతాప్, ఒడుగు సత్యనారాయణ తదితరులు అభినందించారు.

30న ఎస్‌వీకేపీ కళాశాలలో జాతీయ సదస్సు



జాతీయ సదస్సు పోస్టరు ఆవిష్కరిస్తున్న సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కేఆర్ రాజు

పెనుగొండ: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత మునిపల్లె రాజు శతజయంతి పురస్కరించుకుని కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో ఈ నెల 30న జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, సదస్సు డైరెక్టర్ డాక్టరు రంకిరెడ్డి రామ్మోహనరావులతో కలిసి పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో పలువురు ప్రముఖులు, పరిశోధకులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారన్నారు. న్యూఢిల్లీ నుంచి సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కె.శ్రీనివాసరావు, సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని హైదరాబాదు నుంచి వాడ్రేవు చిన వీరభద్రుడు, డాక్టర్ మునిపల్లె ఉషాదేవి పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, కళాశాల తెలుగు శాఖ అధ్యాపకుడు షేక్ ఆదం షా, కె.సురేష్ బాబు, కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



ముంపునకు గురైన పంట చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెనుమంట్ర: ముంపునకు గురైన వరి పొలాలలో వరద నీరు మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. బుధవారం పెనుమంట్ర మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు, మల్లిపూడి గ్రామాల్లో ముంపునకు గురైన పంట చేలను కృషి విజ్ఞాన కేంద్రం ఉండి శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరు శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి బి.దేవి స్వరూప ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎంటీయూ 1318 రకాన్ని రైతులు సాగు చేశారని, అయితే ఈ మురుగునీరు పూర్తిగా బయటికి వెళ్లిన వెంటనే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 20 కేజీలు యూరియాని, 10 కేజీలు పొటాష్ ఎరువులు వేయాలని తెలిపారు. అలాగే సస్యరక్షణ చర్యల్లో భాగంగా 2ఎంఎల్ ఒక లీటర్ నీటికి లేదా ప్రొఫి కొనజోల్ ఒక ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి ఏదో ఒక దానిని పైపాటిగా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కర్రి శంకర్ శ్రీరామారెడ్డి, మారిశెట్టి శ్రీనివాస్, ఆనందకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పాలకొల్లు సెంట్రల్: ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ నవ్య జీవన్, వైద్య సిబ్బంది



పాలకొల్లులో దోమల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ఎం.నవ్య జీవన్ అన్నారు. బుదవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ, అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోధవ్యాధి, మెదడు వాపు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అలాగే కొబ్బరి బొండాల్లో నీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేదంటే నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన వైద్య చికిత్సను పొందాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీవీస్వామి, అమలేశ్వరరావు, ఎలిజిబెత్, ఉదయ్ చందర్, కె.సత్తిబాబు, ముత్యవల్లి, సౌజన్య, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణంలో..

ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో లాకుపేట సెంటర్‌లో ఆరోగ్య సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం లాకు సెంటర్ వద్ద స్థానికులకు దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఫైలేరియా సూపర్‌వైజర్ వై.బాలచంద్రుడు, హెల్త్ అసిస్టెంట్ సత్తిరాజు, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాముడూరు మోడల్ స్కూల్లో బెంగాలీ విద్యార్థుల చేరిక



మాముడూరు మోడల్ స్కూల్‌లో చేర్పిస్తున్న విద్యార్థుల తల్లులు

పెనుమంట్ర: మండలంలోని మాముడూరు గ్రామం బొక్కావారిపాలెంలో రొయ్యల పరిశ్రమలలో పని చేస్తున్న బెంగాలీ కుటుంబాలకు చెందిన బడి ఈడు పిల్లలను బుధవారం మాముడూరు మోడల్ స్కూల్లో చేర్చారు. పాఠశాలకు చెందిన డీఎస్‌వీ సత్యనారాయణ అనే ఉపాధ్యాయుడు ఇక్కడ ఆరుగురు బడిఈడు పిల్లలు ఉన్నట్లు గుర్తించి సమాచారాన్ని ఎంఈఓ యు.నాగేశ్వరరావుకు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు అక్కడ ఆరుగురు బడి ఈడు పిల్లలు ఉన్నట్లు గుర్తించి ఆధార్ కార్డులు కలిగి ఉన్న నలుగురు విద్యార్థులను బడిలో చేర్పించారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులను ఆధార్‌కార్డులు వచ్చిన అనంతరం బడిలో చేర్పిస్తామని వారు తెలిపారు. మాముడూరులో 10 నుంచి 15 కుటుంబాలకు చెందిన బెంగాలీ కూలీలు రొయ్యల పరిశ్రమలో పనిచేస్తున్నట్లు సమాచారం. వారిలో చాలామంది పిల్లలు కూడా ఉన్నారు. అందులో కొందరు మాత్రమే బడిఈడు పిల్లలు కాగా, మిగిలిన పిల్లలు అంగన్‌వాడీ స్థాయికి చెందినవారుగా గుర్తించారు.

ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య ఇబ్బందులు



రాయిపేట సికిలే స్కూల్ గ్రౌండ్ ఎదురుగా అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల కారణంగా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సదరు స్థలాల యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారవుతుంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి, దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. పట్టణంలో స్టేషన్‌పేట, రుస్తుంబాద, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, చలువ పేట, ఎన్టీఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, నందమూరి కాలనీ, చినమామిడిపల్లి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలన్నీ ఇళ్ళ మధ్యే ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. అలాగే చెత్త చెదారం చేరి, దోమలకు ఆలవాలంగా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడటంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో చుట్టు పక్కల వారు రోగాల భారిన పడుతున్నారు. వర్షపు నీరు ఈ స్థలాల్లో నిల్వ ఉండిపోయి, పిచ్చి మొక్కలు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెద జల్లుతోంది. ఇలాంటి ఖాళీ స్థలాల వద్దకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. వైఎస్సార్ కాలనీ శివారు ఆదర్శ్ కాలనీ వద్ద, ఎన్టీఆర్ కాలనీ వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

కన్నెత్తి చూడని మునిసిపల్ అధికారులు

పట్టణంలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో గుర్తించి, ఆ స్థలాలు పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా శానిటరీ అధికారులు ఈ విషయంపై శ్రద్ధ పెట్టాలి. అయితే అది జరగడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువ కావడంతో కొద్ది రోజుల క్రితం ఇలాంటి ఖాళీస్థలాలు శుభ్రం చేసుకోవాలని ప్రకటనలు ఇచ్చి మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకున్నారు. అంతకుమించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. పట్టణంలో మొత్తంగా 250 వరకూ ఇలాంటి ఖాళీ స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్టు అంచనా. చాలా స్థలాలకు సంబంధించి మున్సిపాల్టీకి చెల్లించాల్సిన పన్నులు కూడా కట్టడం లేదని సమాచారం. ఇప్పటికై నా అధికారులు స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిచ్చి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తెచ్చిపెడుతున్న ఖాళీ స్థలాల విషయంలో చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇలాంటి స్థలాల యజమానులకు తెలియజేయడం, స్థలాల్లో బోర్డులు పెడుతున్నాం. వర్షాకాలం దృష్ట్యా ప్రస్తుతం ఈ అంశంపై మళ్లీ దృష్టిపెడతాము. ఖాళీస్థలాల యజమానులు ఇప్పటికైనా తమ స్థలాలను బాగు చేసుకోవాలి.

– ఎం.అంజయ్య, మున్సిపల్ కమిషనర్

గీత కులాల బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో గీత కులాల రిజర్వ్‌డ్ కేటగిరీ (గౌడ) లో వారికి బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 29వ తేది సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 5 లక్షలు రుసుము, రూ. 10 వేలు దరఖాస్తు ప్రాసెసింగ్ రుసుములుగా చెల్లించాలని తెలిపారు. డ్రాలో బార్ దక్కించుకున్న వారికి గీతకులాల రిజర్వు కేటగిరి బార్‌లో భాగంగా లైసెన్సు ఫీజులో రాయితీ ఇవ్వడం ద్వారా రూ.27.50 లక్షలు సంవత్సరం రుసుముగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి నూతన పాలసీ బార్ విధానం ప్రారంభమవుతుందని వివరించారు. 2025–2028 వరకూ మూడేళ్ల కాలపరిమితి ఉంటుందని, ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకూ అమ్మకాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలు కోసం పాలకొల్లు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగ పింఛన్లను కొనసాగించాలి

నరసాపురం రూరల్: దివ్యాంగ పింఛన్లను యథావిధిగా కొనసాగించాలని వైఎస్సార్ సీపీ నరసాపురం మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు ఆశీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తానని చెప్పి ఇప్పుడు వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువ ఉంటే పింఛన్ తీసేస్తామంటూ నోటీసులు ఇవ్వటం సరికాదని పేర్కొన్నారు. లింగనబోయిన చర్ల పంచాయతీలో14 మంది వికలాంగుల పింఛన్‌దారులకు నోటీసులు ఇవ్వడంపై ఆయన అసహనం వక్తం చేశారు. పంచాయతీ పరిధిలో తొలగించిన 14మంది పింఛన్లను కొనసాగించాలని ఆశీష్‌కుమార్ కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చెక్కు అందజేత

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అసోసియేషన్ ఆఫ్ లేస్ ఆరిస్ట్స్, ఇతర మహిళలు సేకరించిన రూ.1,50,000 పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు అందించారు. ఈ మేరకు కూనపరెడ్డి కన్వెన్షన్ హాలులో బుధవారం చెక్కులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా అందించారు. అనంతరం మహిళలకు ఆన్‌లైన్, లైంగిక, మానసిక వేధింపులు, మహిళా హక్కుల గురించిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ శ్రీ గట్టిం మాణిక్యాల రావు తదితరులు, షేడ్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీడీ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ యత్నం చేసిన బాలుడి అరెస్ట్

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామంలో గొలుసు దొంగతనానికి పాల్పడుతూ ఒక మైనర్ బాలుడు బుధవారం పట్టుబడ్డాడు. ఇండియన్ బ్యాంకు సమీపంలో చేగొండి నాగవేణి అనే మహిళ తన ఇంటిలో ఉంది. ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన బాలుడు (16) కత్తితో బెదిరించి మెడలో బంగారువస్తువులు తస్కరించేందుకు ప్రయత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు బాలుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బాలుడిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

రైతులకు విరివిగా పంట రుణాలు

పెనుగొండ: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంట రుణాలు విరివిగా ఇవ్వనున్నట్లు సొసైటీ చైర్‌పర్సన్ నక్కా వేద వ్యాస శాస్త్రి అన్నారు. బుధవారం పెనుగొండ సొసైటీలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించి, సొసైటీ నిధులపై సమీక్ష నిర్వహించారు. పంట రుణాలతో పాటు, రైతులకు అందించాల్సిన ఇన్సూరెన్స్ త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో డైరక్టర్లు కానూరి సత్యనారాయణ, వేంద్ర మురళీ, కార్యదర్శి సూర్నీడి రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటల వరకూ ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, మొగల్తూరు ప్రాంతాల ప్రయాణికులు 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఉండి: రాష్ట్ర విద్యారంగంలో విద్యార్థులు దోపిడీకి గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నేలపై కూర్చుని విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కె.సూర్యనారాయణరాజుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బారినపడి దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.రోహిత్, కె.గోవింద్, సతీష్ పాల్గొన్నారు.